క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అర్థశాస్త్రం (ఉర్దూ విభాగం)లో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సూర్యారావు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు అర్థశాస్త్రం ఉర్దూ మాధ్యమంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అర్హతగా కలిగి ఉండాలని తెలిపారు. అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఇందుకు సంబంధించిన మౌఖిక పరీక్ష, డెమో తరగతులను 7వ తేదీ నిర్వహించనున్నామన్నారు. అర్హత ఉన్న దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగానికి ఎంపికైన అధ్యాపకులు ఉదయం నుండి సాయంత్రం వరకు కళాశాలకు హాజరు కావాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ సూర్యారావు తెలిపారు.

అన్నదానం



రిమ్స్‌లో అన్నదానం చేస్తున్న సేవా సంస్థ సభ్యులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో హెల్పింగ్ టూ వర్స్ పూర్ పీపుల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వాహకులు శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు డాక్టర్ సుబ్బరాయుడు, సాయి కుమార్, రమణ మాట్లాడుతూ పేద ప్రజలకు సేవా చేయాలనే సంకల్పంతో ఈ సంస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. అదే విధంగా క్యాన్సర్ రోగికి ఆర్థిక చేయూత ఇచ్చామన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



ఏ. వెంకటేశ్వర్లు, కడప డీఎస్పీ

కడప అర్బన్ : డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ పోలీసుల విన్నపం ఆలకించాలనీ, కచ్చితంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మన జీవితంలో ఎంతోసేపు వేచి చూస్తాం. జన్మ పొందటానికి తల్లి గర్భంలో 9 నెలలు వేచి చూడాలి. నడవడానికి 2 సంవత్సరాలు వేచి చూడాలి. స్కూల్‌కి వెళ్ళడానికి 3 సంవత్సరాలు వేచి చూడాలి. ఓటు హక్కు కోసం 18 సంవత్సరాలు వేచి చూడాలి, ఉద్యోగం కోసం 25 సంవత్సరాలు ఎదురు చూడాలి. పెళ్ళికోసం 25 నుండి 30 సంవత్సరాలు వేచి ఉండాలి. కానీ.. ఓవర్‌టేక్ చేసే సమయంలో 30 సెకన్లు కూడా ఆగలేకపోతున్నాము! అందుకు ఫలితం.. ఒక చిన్న తప్పిదం, ఒక చిన్న గడబిడ, మీ జీవితాన్ని మారుస్తుంది. ప్రమాదం జరిగితే.. హాస్పిటల్‌లో గంటలు, రోజులు, వారాలు, నెలలు లేదా సంవత్సరాలు కోలుకోలేని పరిస్థితి ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఆలోచించాలని, వేగాన్ని అదుపులో ఉంచుకుని ట్రాఫిక్ నియమాలు పాటించండి. హెల్మెట్ ధరించండి. సురక్షితంగా గమ్యానికి చేరుకోండని ఆయన సూచించారు.

అవయవదానంపై అవగాహన పెరగాలి



అవయవదానంపై ర్యాలీలో పాల్గొన్న కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జమున

కడప అర్బన్ : అవయవదానంపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలని కడప ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున తెలియజేశారు. శనివారం ప్రపంచ అవయవదానం దినోత్సవం సందర్భంగా కడపలోని ప్రభుత్వవైద్యకళాశాల ఆవరణంలో వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మానవశరీరంలో కొన్ని ప్రధానమైన అవయవాలు తమ మరణానంతరం వేరొకరికి ఉపయోగపడతాయన్నారు. తాము మరణించినా కూడా ఆ అవయదానం వలన మరొకరి శరీరం ద్వారా జీవించివుంటామన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి వుండాలనీ, బతికి వుండగానే తమ మరణానంతరం అవయవదానంకు అంగీకారం తెలుపుతూ ఓ పత్రంను శిబిరాలు జరిగినపుడు ఇవ్వవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా చేపల వేటకు వెళ్తే చర్యలు

నందలూరు : అన్నమయ్య జిల్లా సోమశిల వెనుక జలాల యందు చేపల అక్రమ వేటకు వెళ్లే వారిపై చర్యలు తప్పవని మత్స్య శాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. జూలై 30న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం సోమశిల వెనుక జలాల వద్ద టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 1వ తేదీ నుంచి మత్స్యశాఖ అధికారులు వేట చేయనివ్వకుండా నిషేధించినప్పటికీ కొందరు కొనసాగిస్తున్నారని అన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదులు అందడంతో స్పందించి క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయమని టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం



కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు మల్లు రఘునాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఫ్యాప్టో నాయకులు మండిపడ్డారు. శనివారం రాష్ట్ర పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎస్ఎండీ ఇలియాస్‌బాష అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా మల్లు రఘునాథరెడ్డి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధన కాకుండా రికార్డుల నిర్వహణ, రిపోర్టుల తయారీ లాంటి బాధ్యతలను అప్పగించడం తగదన్నారు. గత కొన్నేళ్లుగా ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధించే పరిస్థితి లేదన్నారు. బోధనేతర కార్యక్రమాల వల్ల బోధన సమయం హరించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 27 సంవత్సరాలుగా ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లోపించిందన్నారు. దొడ్డిదారిన ప్రభుత్వ యాజమాన్య స్కూలు అసిస్టెంట్లకు ఎంతఈ ఓ-1, ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తున్నారని, తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బదిలీలు నిర్వహించి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ పొజిషన్ ఐడీల సమస్య పరిష్కరించలేకపోవడం వల్ల ఉపాధ్యాయులు జీతాలు పొందలేని పరిస్థితి ఉందన్నారు. 12వ పీఆర్సీ, మధ్యంతరం భృతి, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్ల కార్పొరేషన్ ఏర్పాటు, సీపీఎస్ అంశం, కేంద్ర ప్రభుత్వ 57 మెమోపై ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వం 14 నెలలైనప్పటికీ ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యూటీ చెల్లింపు, మృతి చెందిన వారికి అంత్యక్రియల ఖర్చు కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్లస్-2 పాఠశాలల్లో మంజూరైన 1752 పోస్టులలో దాదాపు సగం ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఫ్యాప్టో నాయకులు లక్ష్మిరాజా, జీవీ నారాయణరెడ్డి, సురేష్‌బాబు, శ్యాం సుందర్‌రెడ్డి, ఇక్బాల్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించపోతే ఈనెల 12న ఛలో విజయవాడ కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు రాళ్లపల్లి అబ్దుల్లా, సంగమేశ్వర్‌రెడ్డి, మాదెన విజయకుమార్, వీవీ శ్రీనివాసులురెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, బి.రాజు, షేక్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్త వారోత్సవాలు అభినందనీయం



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల, రక్తదాతలతో జిల్లా అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్, అన్నమయ్య జిల్లా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్త వారోత్సవాల రెండవ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను మెమొంటోలతో సత్కరించారు. డీఆర్వో మాట్లాడుతూ రక్తదాన శిబిరాలను గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్వహించిన స్వచ్ఛంద సంస్థలు 457 యూనిట్లు రక్తాన్ని సేకరించాయన్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని 20,000 మంది యువతీ యువకులకి రక్తదానంపై అవగాహన కల్పించడాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఒక వారం రోజుల్లో 457 యూనిట్లు సేకరించడం ఎంతో గొప్ప విషయమని, దీనికి తోడ్పడిన ప్రతి ఒక్కరికి, రక్తదానం చేసిన యువతీయువకులకి అభినందనలు తెలిపారు. ఏపీఎస్ఏసీఎస్ కోఆర్డినేటర్ భాస్కర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు రక్తదానంపై ఈ విధంగా ముందుకు వచ్చి వారం రోజులు పాటు మెగా రక్త వారోత్సవాల పేరుతో రక్తదాన శిబిరాలు నిర్వహించడం సమాజంలోని అందరికీ ప్రేరణగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ యశస్వి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువలకు అడ్డుపడుతున్న చెట్లు



కాలువలకు అడ్డుగా ఉన్న చెట్లు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో మురికి కాల్వలకు ఆనుకొని ఉన్న మొక్కలు, చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మొక్కల వేర్లు కాలువల్లోకి చొచ్చుకుపోవడం వల్ల సీసీ కాలువలు దెబ్బతింటున్నాయన్నారు. ఫలితంగా కాలువల్లో మురికినీరు సక్రమంగా పోవడం లేదంటున్నారు. 8వ డివిజన్‌లోని శంకరాపురంలో శ్వేత హాస్పిటల్, సుబ్బారెడ్డి నర్సింగ్ హోం కు మధ్యలో ఉండే వీధిలో చెట్ల వల్ల కాలువలు పూర్తిగా పాడయ్యాయి. అలాగే ఇండ్ల ముందర మురికి కాల్వలపై పూర్తిగా బండలు వేయటం వలన కూడా కాలువలు బ్లాక్ అయి నీరు ప్రవహించడం లేదు. కాలువల్లో మురికి నీరు సరిగా పోనందున దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. ఇళ్లలో మొక్కలు పెంచుకోవాలి తప్పా ఇలా రోడ్లపై వేయడం సరికాదని పలువురు సూచిస్తున్నారు. దీనిపై శానిటరీ అధికారులు, ప్లానింగ్ అధికారులకు చెప్పినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలువలకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన



తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యత వివరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జమున

కడప అర్బన్ : తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున అన్నారు. కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఆగష్టు 1 నుంచి 7వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తారు. ఈ వారోత్సవాలను రిమ్స్ ఆసుపత్రి ఐపీ విభాగంలో చిన్నపిల్లల వైద్య విభాగంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున బాలింతలను ఉద్దేశించి మాట్లాడారు. తల్లి పాలు తమ బిడ్డలకు చాలా శ్రేష్టమైనవనీ, పుట్టిన ప్రతి బిడ్డకు తల్లులు తమ పాలనే ఇవ్వాలన్నారు. బిడ్డలకు పాలు ఇచ్చేటపుడు తగిన జాగ్రత్తలను పాటించాలనీ, వైద్య సిబ్బంది ద్వారా తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడి డాక్టర్ వంశీధర్ అధ్యక్షతన నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపే నాటికను ప్రదర్శించారు. ఫైనల్ ఎంబిబిఎస్ విద్యార్థిని డాక్టర్ మోహన తల్లి పాల గురించి వివరించారు. తల్లులకు బహుమతులను ప్రదానం చేశారు. బాలింతలకు అందచేస్తున్న పౌష్టికాహారాన్ని నాణ్యతగా అందచేయాలని ఆహారం సరఫరా చేస్తున్న సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, బాలింతలు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని బిల్టప్ సమీపంలోని పాత రియాజ్ థియేటర్ ఎదురుగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు వస్తం అంజి కోరారు. శనివారం ఆర్అండ్‌బి ఈఈకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ పులివెందుల బైపాస్ రోడ్డులో రియాజ్ థియేటర్ ఎదురుగా స్పీడ్ బ్రేకర్ లేనందున అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు వేలాది మంది వాహనాల్లో తిరుగుతూ వేగంగా వెళ్తుండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ ఒక ఎంపీపీ స్కూల్, నివాస గృహాలు ఎక్కువగా ఉన్నాయని రోడ్డు వెంబడి రెయిలింగ్ కూడా లేకపోవడం వల్ల ప్రమాదాలకు ఎక్కువగా ఆస్కారం ఏర్పడుతోందన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కొంతమంది ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చిందన్నారు. కావున తక్షణమే రియాజ్ థియేటర్ ఎంపీపీ స్కూల్ సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు ఈఈ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమములో స్థానిక నాయకులు కే. లక్ష్మయ్య, పి శ్రీను. పెద్దగగులు, ఎం. వెంకటేష్ పాల్గొన్నారు.

మహానటుడు బళ్లారి రాఘవ



బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ జిల్లా రచయితల సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : బెర్నార్డ్ షా, రాబర్ట్ సన్ లాంటి అంతర్జాతీయ నాటక కర్తలు, బందా కనక లింగేశ్వరరావు, పులిపాటి వెంకటేశ్వర్లు మొదలైన ప్రసిద్ధ రంగస్థల కళాకారులు బళ్లారి రాఘవ నటనా వైభవాన్ని చూసి ప్రశంసల జల్లులు కురిపించారని ఆయన భారతదేశం గర్వించదగ్గ మహానటుడని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో వైయస్సార్ జిల్లా రచయితల సంఘం వారు బళ్లారి రాఘవ 146 వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రంగస్థల కళాకారులు దేవరశెట్టి గంగయ్య, యడవల్లి రామలింగయ్య, తిప్పలూరు ఓబులేసు, ప్రకాష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కడప ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

E.P.No.74/2019, O.S.No.199/2011

మొఘల్ అమీర్ బాషా తండ్రి మోహిద్దీన్ బేగ్ డి.నెం.19/356, హాజీ గఫారసాబ్ వీధి, కడప ...పిటీషనరు

V/s

ఎస్.రామాంజనేయరెడ్డి తండ్రి వెంకటరామిరెడ్డి డి.నెం.14/706-3, నక్కాష్ వీధి, కడప ...రెస్పాండెంటు

వేలం నోటీసు

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా రెస్పాండెంటు తాలూకా క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని 04.09.2025వ తేదీన పై కోర్టులో బహిరంగ వేలం వేయబడును. సదరు వేలంలో పాల్గొనదలచిన వారు కోర్టువారి వేలం షరతుల మేరకు వేలంలో పాల్గొనవచ్చును.

SCHEDULE:

ITEM No.1: House bearing D.No. 14/705-3, Nakash Street, Kadapa city of an extent of Ac. 0.02 1/2 cents situated in S.No. 57/2A and 2B, is bounded by:- **East:** Site of M. Narasamma. **West:** Road, **North:** House bearing D.No. 14/705-2 (amended as per the Orders in E.A. No. 338/2024 dated 10-04-2025). **South:** Site in the same survey number belong to third party. Admeasuring:- East - west 40 1/4 feet, north-south 27 feet.

T.Ramalingeswara Raju
Advocate for Petitioner, Kadapa

క్రీడాకారులకు సదుపాయాలు కల్పిస్తాం



కబడ్డీ క్రీడాకారులతో నగర పాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కబడ్డీ క్రీడాకారులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తామని నగర పాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం మున్సిపల్ క్రీడా మైదానంలో ఆంధ్ర ప్రో కబడి యువ ఛాంపియన్స్ కర్నూల్ నైట్స్ ఫ్రాంచైజ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ టీమ్‌ను పరిచయం చేసుకుని శిక్షణ ఎలా జరుగుతుందో పరిశీలించారు. కబడ్డీ క్రీడాకారులకు, జిల్లా క్రీడా ప్రాథమిక సంస్థకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ కోచ్ ఆర్‌వీ శ్రీధర్ పాల్గొన్నారు.

పాదయాత్రగా అంజన్న దర్శనానికి

వీరపునాయునిపల్లె : శ్రావణ మాసం రెండవ శనివారం గండి అంజన్న దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు కాలినడకన వెళ్లారు. ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కమలాపురం, వీరపునాయునిపల్లె మండలంలోని పలు గ్రామాల నుంచి వెళ్లి శనివారం స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు పాలగిరి క్రాస్ వద్ద ఉన్న కాశిరెడ్డి నాయన ఆలయంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించారు.

భక్తులకు సౌకర్యవంతంగా గ్రావెల్ రోడ్డు



పాలకొండ దేవస్థానానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన గ్రావెల్ రోడ్డు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగర శివార్లలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పాలకొండ దేవస్థానానికి భక్తులు వెళ్లేందుకు ఆలయ అధికారులు గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గతంలో రింగు రోడ్డు నుంచి పాలకొండకు వెళ్లేందుకు సరైన రహదారి లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రాళ్లు తేలిన రోడ్డుపైనే భక్తులు ప్రయాణం చేసేవారు. ఈ ఇబ్బందులను గుర్తించిన ఆలయ అధికారులు రింగు రోడ్డు నుంచి ఆలయం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ బాక్సర్‌కు సన్మానం



జగదీష్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

నందలూరు : అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలలో బంగారు పతకం సాధించిన నందలూరు వీఆర్‌ఓ మండ్ల జగదీష్‌ను తహసీల్దారు అమరేశ్వరి, సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె గ్రామానికి చెందిన జగదీష్ జులై 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ నేపాల్‌లో జరిగిన ఇన్విటేషన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీలలో 72 నుంచి 75 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పోటీలలో పాల్గొని విజయం సాధించి దేశ కీర్తి ప్రతిష్ఠతను పెంపొందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోహన్, ఆర్‌ఐ సుశీల్, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలి



రాజీవ్ పార్క్ వద్ద వ్యాపారులకు సూచనలు చేస్తున్న పోలీసు అధికారులు

కడప అర్బన్ : కడప నగరంలోని రాజీవ్ పార్క్ వద్ద ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని చిరు వ్యాపారులకు కడప ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణ, ట్రాఫిక్ సీఐ జావేద్, ఒన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం రాజీవ్ పార్క్ వద్ద వ్యాపారులతో పోలీసు అధికారులు మాట్లాడారు. బైక్ పార్కింగ్ సరిపడా స్థలాన్ని కేటాయించాలని నగరపాలక సంస్థ సిబ్బందికి సూచించారు. వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

సిద్దవటం : మండలంలోని పెన్నానదీ పరివాహ ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా చేసినా, ప్రభుత్వ డీకేటీ స్థలాలను ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని సిద్దవటం తహసీల్దారు తిరుమలబాబు అన్నారు. సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ కొంతమంది ఇసుక డంపింగ్ చేసినట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, నిఘా వేసి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గృహ నిర్మాణాలకు అనుమతులు తీసుకొని ఇసుక రవాణా చేసుకోవాలన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలో శావణమాసం రెండో శనివారం సందర్భంగా వైభవంగా పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమ లింగేశ్వర, నరసింహాస్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులు స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తే ధ్వంసం చేస్తాం

కమలాపురం : విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే ధ్వంసం చేస్తామని, అదానితో విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుంటి వేణుగోపాల్ హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచినా, స్మార్ట్ మీటర్లు బిగించినా వాటిని పగులగొట్టి తీరుతాం అని ఆయన హెచ్చరించారు. విద్యుత్ సంస్కరణలు తెచ్చింది తానేనని చంద్రబాబు చంకలు గుద్దుకుంటుంటాడని, ఆ సంస్కరణల భారం అంతా ప్రజల పైనే పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో విద్యుత్ చార్జీలు పెంచితే ప్రజల్లో తిరుగుబాటు మొదలై ప్రభుత్వం పడిపోయిందని ఆయన గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్ అంటే మొబైల్ రీచార్జ్‌తో సమానం అని, రీచార్జ్ చేసుకోకుంటే సరఫరా ఆగిపోతుందని, దీంతో మొత్తం చీకటి మయం అవుతుందన్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సరఫరా సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ధారా దత్తం చేసే ప్రయత్నం మానుకోవాలని ఆయన హితవు పలికారు. విద్యుత్ పేరుతో ప్రజలను దోచుకుంటే పతనం తప్పదని ఆయన హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించి చరిత్ర తిరగరాయండి



ఇరగంరెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని గెలిపించి 14ఏళ్లుగా ఉన్న చరిత్రను తిరగరాయాలని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. మండలంలోని కొండమాచుపల్లి, చెర్లోపల్లి, నడింపల్లి గ్రామాలలో అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ప్రచారం నిర్వహించారు. రాజంపేట ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆయనతోపాటు పాల్గొని ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. తమ విలువైన ఓటు వేసి, వేయించి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తిచేసుకున్నా ప్రజలకు సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేదన్నారు. వారి వైఫల్యాన్ని వ్యతిరేకించేలా ఈ జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి వారికి ప్రజలు బుద్ధిచెప్పాలన్నారు. ఈ ఎన్నికల్లో వచ్చే ఫలితాలే 2029 ఎన్నికలను నిర్ణయిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, కూండ్ల ఓబుల్‌రెడ్డి, మేరువ శివనారాయణ, దుస్సాతల లక్ష్మీనారాయణరెడ్డి, పోలి నరసింహారెడ్డి, పన్నెల చంద్ర, చేపూరి ఓబయ్య, జాకీర్ హుసేన్, మేకపాటి నందకిశోర్‌రెడ్డి, ఇరగంరెడ్డి శ్రీకర్‌రెడ్డి, కొత్తపల్లి రవి, పాలెం పాండురంగారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చామా సుబ్బారెడ్డి, మాధవరెడ్డి, రవి రాజు, రవిరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, వెంకటేష్ రెడ్డి, పోతిరెడ్డి దశరథరామిరెడ్డి, ఎం.ఎస్ వెంకటేశ్వర్లు, లక్షుమయ్య, క్రిష్ణమోహన్, యానాదయ్య పాల్గొన్నారు.

ప్రజలను ప్రభుత్వం మోసం చేసింది

ఒంటిమిట్ట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి మోసం చేశారని అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్ నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నడింపల్లి గ్రామంలో శనివారం ఆయన బాబు ష్యూరిటి మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాల హామీ పేరుతో రాష్ట్ర ప్రజలను ఎలా మోసం చేశారో వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను అమలు చేసి ఇచ్చిన మాటపై నిలబడిన ఏకైక వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఆయన పాలనలో రాష్ట్రంలోని పేదలు సస్యశ్యామలంగా జీవించారన్నారు.